క్లుప్తంగా

బొగ్గవరపు సత్రం భూములను కాపాడండి

కాకినాడ సిటీ: బొగ్గవరపు సత్రం భూములు అన్యక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ బృందం మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మధు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం రైతులకు భూములను సీపీఐ పంపిణీ చేసిందన్నారు. రూ.కోట్ల విలువైన ఈ భూమిని చౌకగా కబ్జా చేయాలని చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై ఆర్డీవోతో పూర్తిస్థాయి విచారణ చేయిస్తామని, దీనికి అందరూ సహకరించాలని కలెక్టర్ కృతికా శుక్లా వివరించినట్లు మధు పేర్కొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: దళిత హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి–2023 డైరీని కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ డైరీపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో బాగుందని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ ఈ డైరీలో అట్రాసిటీ సెక్షన్లు, రాజ్యాంగం చట్టాలు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తదితర అంశాలు ఉన్నాయని ఈ డైరీ ప్రతి దళితులకు ఉపయోగపడుతుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఐ నాయకులు కె.బోడకొండ, పి.సత్యనారాయణ, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ తదితరులు

కాకినాడ రూరల్: భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. అండర్–19 కేటగిరిలో ఇంటర్ విద్యార్థులు మూడు స్వర్ణ పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ టి.సుశీల తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.దీపిక కుమారి, బి.గీత, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.భవాని ఈ ఘనత సాధించారని, దీపిక కుమారి ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినులను పీడీ శారద, పీఈటీ పద్మలను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కాకినాడ సిటీ: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అటవీశాఖాధికారి ఆధ్వర్యంలో కోరంగి అభయారణ్యంలో ఈనెల 2న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు చిత్తడి నేలలపై క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తామన్నారు.

పోషకాహారం పంపిణీ

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణాసేవాసమితి ఆడిటోరియంలో హెచ్ఐవీ బాలబాలికలకు మంగళవారం పోషకాహారం పంపిణీ చేశారు. 50 మంది హెచ్ఐవీ బాలబాలికలకు ప్రతీ నెల పోషకాహారం అందజేస్తున్నామని సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ అన్నారు. సమితి అందజేసిన పోషకాహారం పిల్లలకు విధిగా వినియోగించాలని తల్లిదండ్రులకు గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి కె.మహాలక్ష్మి, కేఎస్ విశ్వనాథం, కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ: స్థానిక రామకృష్ణారావుపేట, ఆనంద భారతి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ కె.రమేష్ మంగళవారం పరిశీలించారు. రహదారులపై చెత్త ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల వద్దకు చెత్త వాహనాలు వస్తున్నప్పటికీ రహదారులపై చెత్త వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ ఉద్యోగులకు ఆయన సూచించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు ఉన్నారు. అలాగే అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఏడో డివిజన్ రేచర్లపేట ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికీ చెత్త సేకరణ, తడి– పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. రోడ్లపైన డ్రైన్‌లోను చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

కులాల స్థానే ప్రముఖుల పేర్లు

- 15 ప్రాంతాలకు కొత్త నామకరణాలు
- రావుగోపాలరావుకు తగిన ప్రాధాన్యం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడి


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు

కాకినాడ: ముఖ్యమైన ప్రాంతాలు, వీధులకు ప్రస్తుతం ఉన్న కులాల పేర్లను తొలగించి వాటి స్థానంలో సముచిత సేవలందించిన ప్రముఖుల పేర్లతో మారుస్తూ కౌన్సిల్ తీర్మానించినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సూచన మేరకు కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ కృతికాశుక్లా అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం జరిగిందన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆ వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. కాకినాడలోని దాదాపు 15 ప్రాంతాలకు పలు కులాల పేర్లు ఉన్నాయని, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సూచనల మేరకు ఆయా ప్రాంతాల పెద్దల సూచనలు, సలహాలు తీసుకుని కొత్తపేర్లను నిర్ణయించామన్నారు. అందులోనూ విశిష్ట సేవలు అందించిన ప్రముఖుల పేర్లు, ఆరాధ్య దేవతల పేర్లు పెట్టేందుకు తీర్మానించినట్టు తెలిపారు. కాకినాడలో నివసించి అత్యున్నతస్థాయికి ఎదిగిన సినీనటుడు రావుగోపాలరావు పేరును కూడా ఓ ప్రాంతానికి పెట్టామన్నారు. సమావేశంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ వెలమల మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మధుర జ్ఞాపకాలు మిగిల్చేలా...

కాకినాడ సాలిపేట ప్రాంతానికి ప్రఖ్యాత నటులు రావు గోపాలరావు మార్గ్‌గా పేరు పెట్టడంపై తూర్పుగోదావరి జిల్లా పద్మనాయక వెలమ అసోసియేషన్ ప్రతినిధులు డివిఎస్ఎన్ మూర్తి(మురళి), కోటగిరి సత్యంబాబు, చెలికాని అచ్యుతరావు హర్షం వ్యక్తం చేశారు. రావుగోపాలరావు చేసిన సేవలు చిరస్థాయిగా ఉండిపోయేలా ఎమ్మెల్యే ద్వారంపూడి తీసుకున్న చొరవ ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

మనుగడ కోసమే లోకేష్ పాదయాత్ర

టీడీపీ మనుగడ కోసమే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు చేసే పాదయాత్రలకు ప్రజాదరణ ఉంటుందని, రాష్ట్రంలో ఏం సమస్యలు ఉన్నాయని ప్రశ్నిస్తూ సుమారు 90 శాతం హామీలు అమలు చేయడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు.

డివిజన్	ప్రస్తుత పేరు	మార్చిన పేరు
23	రెల్లి వీధి	శ్రీ వడ్డి పోలమాంబవీధి
23	రెల్లి వీధి	మీసాల అనంతరావు వీధి
24	రజక వీధి	శ్రీ దుర్గాదేవి వీధి
24	కాపు వీధి	చామకూర నాగబాబు వీధి
48	హరిజనపేట	డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నగర్
28	తెలుకులవారివీధి	చంద్రపు స్వామి జియ్యారావు వీధి
31	కాబోలివారివీధి	ఆంజనేయస్వామి గుడి వీధి–1
31	కాబోలివారివీధి	ఆంజనేయస్వామి గుడి వీధి–2
31	గొల్లల స్ట్రీట్	కృష్ణుడి గుడివీధి–1
31	గొల్లల స్ట్రీట్	కృష్ణుడి గుడివీధి–2
31	రెల్లి వీధి	శబరినగర్
35	రజక వీధి	నూకల రాధ వీధి
36	శాలిపేట	రావు గోపాలరావు మార్గ్
43	శెట్టిబలిజపేట	వాసంశెట్టి మధు వీధి
27	కాపులవారివీధి	ద్వారబంధాల చంద్రయ్య వీధి

నా తండ్రికి దక్కిన గౌరవమిది



తెలుగువారికి అత్యంత ఇష్టమైన, మానవతావాదిగా, గొప్పనటుడిగా పేరొందిన నా తండ్రి పేరుతో కాకినాడ సాలిపేట ప్రాంతానికి రావుగోపాలరావు మార్గ్‌గా నామకరణం చేశారన్న సమాచారం ఎంతో సంతోషంగా అనిపించింది. ఇదిన నా తండ్రికి దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇందుకోసం కృషి చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి హృదయపూర్వకంగా ధన్యవాదాలు. అలాగే కౌన్సిల్‌కు, ప్రజలకు కృతజ్ఞతలు.

రావు గోపాలరావు తనయుడు రమేష్

వలంటీర్లే ఆపద మిత్రలు


శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లతో టీపీఆర్వో కృష్ణ మోహన్

కాకినాడ: ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలు కలగకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలపై 25 మంది వలంటీర్లకు 'ఆపద మిత్ర' పేరుతో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారితో టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ మంగళవారం నగరపాలక సంస్థ పాత భవనంలో సమావేశమయ్యారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా, సమర్థవంతంగా నిలవాలని వారికి సూచించారు. శిక్షణ పొందిన ప్రతి వలంటీర్‌కు పదివేల రూపాయలు విలువైన కిట్‌ను ప్రభుత్వ అందజేసినట్లు చెప్పారు. ఇందులో లైఫ్ జాకెట్‌తో పాటు మరికొన్ని పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. శిక్షణ వివరాలను, ప్రయోజనాలను మిగిలిన వలంటీర్లకు వివరించి ఆపత్కాలంలో స్పందించేలా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఆరు బ్యాచ్‌లకు సామర్లకోట శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తయిందన్నారు. టీపీఆర్వో కృష్ణ మోహన్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

నాడు–నేడు పనులపై సమీక్ష


కరపలో నాడు–నేడు పనులపై సమీక్షిస్తున్న అధికారులు

కరప: నాడు–నేడు పనులను సకాలంలో పూర్తిచేయించాలని ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఏఈఈ వెంకటరాజు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్‌లో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయా పనులపై సమీక్షించారు. మండల పరిధి 38 పాఠశాలల్లో రెండో విడత పనులు జరుగుతున్నాయని, ఆయా పనుల వివరాలు ఎం.బుక్‌లో నమోదుచేయాలన్నారు. మొదటి విడతలో పనులు చేసిన పాఠశాలల్లో సమస్యలుంటే సరిచేయడం జరుగుతుందన్నారు. తర్వాత ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి పాఠశాలల్లో చేయాల్సిన పనులపై సమీక్షించారు. వేములవాడ, నడకుదురు, కరప హైస్కూళ్ల హెచ్ఎంలు ఎం.శ్రీనివాస్, వి.సుజాత, యు.లీలామనోహర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంవిద్–2023


'సంవిద్ 2023'ను ప్రారంభిస్తున్న ఎండీ శ్రీ రామసంజీవ్, కమిషనర్ రమేష్ తదితరులు


వేడుకలలో విద్యార్థినుల నృత్యరూపకం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): స్థానిక సూర్యకళామందిర్ ప్రాంగణంలో కాకినాడ సంజీవ్ కాలేజీ అఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మానేజ్‌మెంట్, సైన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాలల ×సంవిద్–2023 ×మానేజ్మెంట్, సైన్స్ ఫెస్ట్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంయుక్త కళాశాలల ఎండీ పి.శ్రీ రామ సంజీవ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రదర్శించటానికి ఇటువంటి ఈవెంట్లు దోహదపడతాయని అన్నారు. నగర కమిషనర్ కొమ్ము రమేష్, డాక్టర్ రాయుడు త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈవెంట్‌లో సంయుక్త కళాశాలల చైర్మన్ పి.ఆనందరాయుడు, డీన్ కె.శ్రీనివాస్, ఏవోపీ శ్రీనివాస్, కళాశాలల అకడమిక్ డీన్ డాక్టర్ రవివర్మ, ఈవెంట్ కోఆర్డినేటర్లు టి.కనకలక్ష్మి, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం పూర్తి

- నేడు ముఖద్వారానికి ప్రారంభోత్సవం
- 5న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


కరపలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఉప్పాలమ్మతల్లి ఆలయం, ముఖద్వారం

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణపనులు పూర్తికావచ్చాయి. ఈ నెల ఐదున ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతుల అమ్మవారి విగ్రహప్రతిష్ఠ చేసేందుకు నిర్మాణకమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికుల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయించి, గత ఏడాది ఫిబ్రవరి 3న భూమిపూజ చేశారు. ప్రభుత్వ నిధులతో పాటు గ్రామస్తులు, పరిసర గ్రామాలవారు, వ్యాపారులు, రాజకీయ నాయకులు తమవంతు సహకారంగా బంగారు, వెండి ఆభరణాలు, ఇతర నిర్మాణ పనులకు సుమారుగా రూ.80 లక్షల వరకు విరాళాలుగా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు ఆలయనిర్మాణ కమిటీగా ఏర్పడి పనులను పర్యవేక్షించారు. సంపర గ్రామానికి చెందిన శిల్పి డేగల శ్రీరాములు ఉప్పాలమ్మతల్లి విగ్రహం, ఆలయ నిర్మాణపనులను తీర్చిదిద్దారు. వైస్ ఎంపీపీ సత్యభీమేశ్వరరావు సోదరులు తమ తల్లిదండ్రులు పాట్నీడి సూర్యకాంతం, శంకరరావుల జ్ఞాపకార్థం ఉప్పాలమ్మగుడి ముఖద్వారాన్ని నిర్మించగా బుధవారం ఉదయం 9 గంటలకు రాజకీయ నాయకులతో ప్రారంభోత్సవం చేయిస్తున్నారు. 11 గంటలకు స్వస్తివాచనాలతో యాగశాల ప్రదక్షిణ, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, నాలుగో తేదీ వరకు పూజలు నిర్వహించనున్నారు. 5న ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులతో అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపన, కలశస్థాపన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 25 వేల మందికి అమ్మవారి ప్రసాదవితరణ ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు .

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కాకినాడ రూరల్: కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి ఒక రకమైన బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. నివారణ కోసం ప్రభుత్వం మల్టీ డ్రగ్ థెరపీ మందులను ఉచితంగా ఉందిస్తుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, పార్థసారధి, రాజా, పాల్గొన్నారు.

వీధి బాలలను ఆదుకోవాలి

కాకినాడ రూరల్: వీధి బాలలను ప్రయోజకులుగా చేస్తే దేశ ప్రగతికి కారకులు అవుతారని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. రమణయ్యపేట ఆంజనేయనగర్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీధి బాలల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిరాశ్రయులైన వీధి బాలలను ఆదుకోపోతే అనాథలుగా, దొంగలుగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సత్తెప్పనాయుడు

కాకినాడ: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన తమ్మనపూడి సత్తెప్పనాయుడు ఏఐసీసీ నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో ఎన్నికయ్యారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు ఈ మేరకు ఆయనను సత్కరించారు.

క్షతగాత్రునికి ఆర్థికసాయం

కరప: మండలం యండమూరులో ఇటీవల ప్రమాదవశాత్తూ రెండుకాళ్లు కోల్పోయి, ఇంటివద్ద ఉంటున్న రవ్వ సాయిబాబాకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచే శ్రీనివాస్‌బాబా మంగళవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం టీడీపీ నాయకులు పార్టీ కార్యకర్తలతో కలసి రాష్ట్రానికి ఇదేం కర్మ నిర్వహించారు.

ఆంజనేయమూర్తికి రోటరీ లైఫ్‌టైమ్ అవార్డు

బోట్‌క్లబ్: సీనియర్ రోటరీ సభ్యులు, మాజీ గవర్నర్ కేవీఎస్ ఆంజనేయమూర్తికి రోటరీ డిస్ట్రిక్ట్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కరరామ్ ఆదివారం రాజమహేంద్రవరంలో అందజేశారు. మంగళవారం కాకినాడ రోటరీ హాల్‌లో ఆంజనేయమూర్తికి రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు ఈ మేరకు సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు కృష్ణప్రకాష్, క్లబ్ మాజీ గవర్నర్లు ఎస్‌వీఎస్‌రావు, బ్లడ్ బ్యాంకు చైర్మన్ టీవీ బాలకృష్ణ, పల్స్‌పోలియో సబ్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్ ఉదయభాను ఆయనను అభినందించారు.

ఎంఎస్ఎన్‌లో వ్యాసరచన పోటీలు

బాలాజీచెరువు: మల్లాడి సత్యలింగనాయకర్ 108వ వర్ధంతి సందర్భంగా ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిటీతో పాటు రూరల్ ప్రాంతాల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలకు చెందిన 256 మంది పాల్గొన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అమరేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

3న సంకల్ప దీక్ష

కాకినాడ సిటీ: సీపీఎస్ రద్దు కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న గన్నవరంలో చేపట్టిన సంకల్పదీక్షను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ మంగళవారం ఆవిష్కరించారు. ఈ దీక్షకు సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకులు కేవీవీ నగేష్, తోటకూర రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత బియ్యం పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చాముండేశ్వరిదేవి మంగళవారం తెలిపారు. 420 ఎండీయూ వాహనాల ద్వారా 6.45 కార్డుదారులకు 9,268 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇంటి వద్దే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ వాహనాల ద్వారా అందించే పంచదార, కందిపప్పులకు డబ్బు తీసుకుంటారన్నారు. కేజీ కందిపప్పు రూ.67, అర లో పంచదార రూ.17 తీసుకుంటారన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వేములవాడలో గడప గడపకూ..


వేములవాడలో కరపత్రం అందజేసి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: పేదవర్గాలకు ఆర్థికంగా చేయూతనిచ్చి, వారి అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్నారన్నారు. వేములవాడలో మంగళవారం సాయంత్రం స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్, డీసీ మాజీ అధ్యక్షుడు బండే తాతాజీ, మాజీ ఎంపీపీ కమిడి సీతామహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండే వీరబాబు, వజ్రపు కామేశ్వరరావు, అప్పనపల్లి పెద్ద, పాలిక వీర్రాజు, విత్తనాల శ్రీను ఆయనకు స్వాగతం పలకగా రామాలయంలో పూజలు చేశారు. పోలినాటివారిపేట, ఇతర వీధులలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించి, సమస్యల అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు కోరగా, త్వరలోనే వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. 101 సంవత్సరాల మంగయ్యమ్మను పలకరించి, పింఛన్ అందుతోందా అని అడగ్గా.. ప్రతి నెలా ఇంటికి వచ్చి ఇస్తున్నారని బదులిచ్చింది. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఎవరికెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలకు మోసకపోకుండా వచ్చే ఎన్నికల్లో తనను, సీఎం జగన్‌ను ఆశీర్వదించి గెలిపించాలని కన్నబాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల ప్రసాద్, చోడిశెట్టి చంటి, రెడ్డిపల్లి రమేష్, కొత్త రవి, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారి శైలజ, కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

'గడప గడపకు' ఓ వినూత్న విధానం

- ఎమ్మెల్యే ద్వారంపూడి
- 7వ డివిజన్‌లో ఇంటింటికీ పథకాల వివరణ


ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి జగన్ ప్రతిపాదించిన గడపగడపకు మన ప్రభుత్వం దేశ చరిత్రలోనే ఒక వినూత్న విధానమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 7వ డివిజన్ మదర్ థెరిస్సా విగ్రహం నుంచి మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పలువురు అధికారులు వీరివెంట ఉన్నారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నవరత్న పథకాలు ద్వారా ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రతి గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని మరీ పరిష్కరించే విధంగా రూపొందించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. మొక్కుబడి పర్యటనగా కాకుండా ప్రజలు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించడం సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తొంపల తాతారావు, మాజీ కార్పొరేటర్ సిగల మధు, స్థానిక నాయకులు బత్తిన రాజు, నందకుమార్, దొర్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో గురజనాపల్లి విద్యార్థుల ప్రతిభ


జిల్లా జట్టుకు షీల్డు అందజేస్తున్న తిమ్మయ్య

కరప: కర్నూలులో ఈనెల 29 నుంచి మంగళవారం వరకు జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలికల జట్టుకు తృతీయ బహుమతి లభించింది. స్కూల్‌గేమ్స్ అండర్–17 విభాగంలో జిల్లా బాలికల జట్టు తరపున మండలంలోని గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుత్తుల కృష్ణతేజ, పలివెల సునందతేజశ్రీ, యర్రా జ్యోతిచంద్రిక పాల్గొన్నట్టు హెచ్ఎం బీఆర్‌వీ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. కర్నూలులోని ఆదర్శ విద్యాలయ సంస్థల అధినేత తిమ్మయ్య తృతీయస్థానం పొందిన జట్టుకు షీల్డ్‌ను అందజేశారన్నారు. రగ్బీ జిల్లా జట్టులో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థినులను, పీడీ కె.నాగలింగేశ్వరరావును హెచ్ఎం ప్రసాదరావు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ పబ్బినీడి వీరబాబు, సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

యాదవ సామాజిక భవనానికి శంకుస్థాపన


వాకలపూడిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: నియోజవర్గంలో వివిధ సామాజిక భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వాకలపూడిలో యాదవ సంక్షేమ సంఘం సామాజిక భవన నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు రూ.15లక్షల నిధులతో మంగళవారం శంకుస్థాపన చేశారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఏఈ వాసుదేవరావును కోరారు. ఈ సంఘం జిల్లా భవనానికి స్థలం కోరుతున్నారని ఆ ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. వలసపాకలలో కోవిడ్ వల్ల నిలచిపోయిన మత్స్యకార సామాజిక భవన నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఏఈ వాసుదేవరావు, యాదవ సంఘ పెద్దలు నమ్మి రామకృష్ణ యాదవ్, రామలక్ష్మణ్, అప్పారావు తదితరులతో పాటు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు గొల్లపల్లి జగన్, కాశీ, గంపల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు మంగళవారం తెలిపారు. 4న స్వామి వారి రథోత్సవం, 6న శ్రీపుష్పయాగం, 7న తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.